క్లుప్తంగా

చదువులో రాణిస్తే ఉన్నత స్థితి



రాచూరు హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: పేదరికం నుంచి బయటపడటానికి, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడానికి చదువు ఒకటే మార్గమని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. సోమవారం రాచూరు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో 95 శాతం తక్కువ కాకుండా ఫలితాలు సాధించాలన్నారు. పదవ తరగతి ప్రాధాన్యతను వివరిస్తూ, పదవ తరగతిలో ఫెయిల్ అయితే చాలా మంది డ్రాపవుట్‌గా మిగిలిపోతున్నారని అన్నారు. పదో తరగతి విద్యార్థి జీవితంలో కీలకమైనదని అన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులతో, టీచర్లు, హెచ్‌ఎంతో సమీక్షించారు.

రెవెన్యూ సిబ్బందికి సహకరించండి

దెందులూరు: ప్రభుత్వ భూములు, జిరాయితీ భూముల గుర్తింపు, సరిహద్దుల నిర్ధారణ కార్యక్రమానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మలకచర్లలో లక్ష్యాలు నెరవేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజలు వారికి సహకరించాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం మలకచర్ల రెవెన్యూ ఉద్యోగులు, రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి అన్ని కూడళ్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి గ్రామ సభ నిర్వహించారు.

స్వచ్ఛ దివస్‌కు గ్రామాల బాధ్యుల నియామకం

ఉంగుటూరు: గ్రామాల్లో స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ప్రజలు, అధికారుల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా కలెక్టరు గ్రామాల వారీ అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించామని ఆయన తెలిపారు. గ్రామాల్లో వీరు ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రామంలో ఉండే అందరినీ కలుపుకుని ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు.

నేడు ఉంగుటూరులో వైద్యశిబిరం

ఉంగుటూరు: స్థానిక టోలు ప్లాజా వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు టోలు ప్లాజా మేనేజర్ ఇంతియాజ్ తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు ఉచిత వైద్యశిబిరం జరుగుతుందని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరం వేద హాస్పిటల్ వెన్నుముక శస్త్ర చికిత్స నిపుణుడు తేజో ఫణీంద్ర సేవలు అందిస్తారని తెలిపారు. శిబిరంలో రూ.2,500 విలువగల ఎముక పటిష్ట పరీక్ష ఉచితంగా నిర్వహిస్తారని, వెన్నెముక, ఆర్థో సమస్యలు పరీక్షించి తగిన సూచనలు,సలహాలు, మందులు అందజేస్తారని టోలు ప్లాజా మేనేజర్ తెలిపారు.

చంద్రబాబు దావోస్ పర్యటనతో ప్రయోజనం శూన్యం

దెందులూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటన ప్రచారానికి రూ.కోట్లు వెచ్చించడం సబబు కాదని, ఆయన పర్యటనతో ప్రయోజనం శూన్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి అన్నారు. సోమవారం ఆయన పోతునూరులో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి పరిస్థితులు మెచ్చేలా ఉంటే దావోస్‌లోనే కాకుండా ప్రపంచంలో ఏ ప్రాంతంలో నుంచి అయినా పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు ముందుకు వస్తారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా ఎన్నికల హామీల అమలుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించడం లేదన్నారు. చంద్రబాబు ప్రజాధనాన్ని మీడియాకు, వివిధ టీవీ చానల్స్‌కు వెచ్చించి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలుతోపాటు దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఈ దుబారా ఖర్చును ప్రచార ఆర్భాటాలను గమనిస్తున్నారన్నారు.

సినీ నటుడు కృష్ణంరాజు ఆశయాల సాధనకు కృషి

ఉంగుటూరు: కేంద్ర మాజీ మంత్రి, సినీ నటుడు కృష్ణంరాజు అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమవరంలో డీఎన్ఆర్ ఇంగ్లీషు మీడియం స్కూలు వద్ద కృష్ణంరాజు 84 జయంతి సందర్భంగా యూకే-ఇండియా డయాబెటిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా సుగర్ వ్యాధి చికిత్స శిబిరంలో ధర్మరాజు పాల్గొన్నారు. ప్రముఖ డాక్టర్ వేణు కవర్తపు ఆధ్వర్యంలో వివిధ దేశ విదేశాల నుంచి వచ్చిన వైద్య బృందం శిబిరానికి వచ్చిన ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కృష్ణంరాజు భార్య ఉప్పలపాటి శ్యామల దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజుకు మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

రైల్వే గేట్ల మూసివేత.. ప్రయాణానికి ఇక్కట్లు

- ఓ పక్క పాతూరు గేటు వద్ద అభివృద్ధి పనులు
- మరో పక్క భీమడోలు గేటు మరమ్మతులు
- ప్రయాణానికి తప్పని అవస్థలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కష్టమే..



పాతూరు వద్ద నిర్మాణ దశలో రైల్వే అండర్ బ్రిడ్జి



పాతూరు రైల్వే గేటు వద్ద నడిచేందుకు వీలులేని దారి



మరమ్మతుల నేపథ్యంలో మూత పడనున్న భీమడోలు రైల్వే గేటు

భీమడోలు: ఓ పక్క పాతూరు గేటు అండర్ బ్రిడ్జి పనులు సాగుతున్నాయి. మరో పక్క భీమడోలు రైల్వే గేటును అత్యవసర మరమ్మతుల కోసం రైల్వే అధికారులు తాత్కాలికంగా మూసేస్తున్నారు. రైల్వే గేటు మంగళవారం నుంచి 30వ తేదీ వరకు మూత పడనుంది. దీనితో జిల్లా నలుమూలల నుంచి భీమడోలు మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వచ్చే భక్తులు, భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రైల్వే శాఖ అధికారులు సూచించారు. వాహనాలన్నీ గుండుగొలను, కురెళ్లగూడెం నుంచి భీమడోలు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా భీమడోలు, పాతూరు నుంచి తాడేపల్లిగూడెం వైపునకు వెళ్లాలంటే సరైన మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. భీమడోలు, సూరప్పగూడెం గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు పాతూరు, పెదలింగంపాడు ప్రాంతాల్లోని పంట పొలాలకు వెళ్లాలంటే ఈ గేటును దాటి వెళ్లాలి. అభివృద్ధి, మరమ్మతుల పనులు నేపథ్యంలో మూసి వేసి ఉన్న గేట్లు దాటడం కష్టంగా మారుతోంది. దీనితో దాళ్వా సాగుకు కీలకంగా ఉన్న ఈ తరుణంలో ఆయకట్టు ప్రాంతాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు తప్పేట్లు లేవు.

నెలల తరబడి పాతూరు అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

జాతీయ, రాష్ట్రీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న పాతూరు రైల్వే గేటు అభివృద్ధి పనులు నెలల తరబడి సాగుతుండడంతో ప్రజల కష్టాలు అంతా ఇంతా కావు. ఈ వంతెన నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు అంటున్నారు. దీనితో ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు వద్ద గేటు మూసేందుకు రైల్వే అధికారులు ఇక్కడ కొన్ని నెలల కితం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టింది. ఆ పనులు వివిధ సాంకేతిక కారణాల రీత్యా నత్తనడకన సాగుతుండడంతో ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, ప్రజలు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారాయి. రైల్వే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఐదారు నెలల్లో పూర్తి చేయాల్సిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణం నేటికీ కొనసాగుతూనే ఉంది. దీని వల్ల సూరప్పగూడెం రైతాంగానికి చెందిన వ్యవసాయ భూములన్నీ పాతూరులో ఉండడంతో రైతులు నిత్యం ఈ గేటు దాటి వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉంది. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాతూరు వెళ్లే మార్గం లేక వారు నరకయాతనను అనుభవిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. దీని వారంతా అదనంగా 10 నుంచి 12 కిలో మీటర్ల దూరం ప్రయాణించి భీమడోలు, గుండుగొలను మీదుగా పాతూరు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇదీ ఇలా ఉండగా భీమడోలు రైల్వే గేటును అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు మూసి వేస్తుండడంతో ఆ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతంలో భీమడోలు రైల్వే గేటు మరమ్మతులు చేపడితే ప్రత్యామ్నాయంగా పాతూరు గేటు మీదుగా రాకపోకలు సాగించే వారు. ప్రస్తుతం ఆ గేటు మీదుగా ఎటువంటి వాహనం వెళ్లే దారి లేదు. దీనితో ప్రత్యామ్నాయంగా వాహనాలు కురెళ్లగూడెం, గుండుగొలను మీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఏది ఏమైనా 9 రోజుల పాటు భారీ వాహన చోదకులు చుక్కలు చూడడం ఖాయమని పలువురు అంటున్నారు.

ముందుగా సమాచారం ఇస్తే బాగుంటుంది



ప్రస్తుతం దాళ్వా సాగులో రైతులు నిమగ్నమయ్యారు. వారంతా పంట పొలాలకు ఎరువులు వేస్తున్నారు.ఈ తరుణంలో భీమడోలు రైల్వే గేటు మరమ్మతులు చేసే ఆలోచన ఉంటే రైల్వే శాఖ అధికారులు రైతులు, ప్రజలకు వారం రోజులు ముందుగా సమాచారం ఇస్తే బాగుంటుంది. పాతూరు గేటు వద్ద అభివృద్ధి పనులు చేస్తున్నారు. దీనితో భీమడోలు, పాతూరు గేటుల మీదుగా రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారు. ప్రత్యామ్నాయంగా కురెళ్లగూడెం, గుండుగొలను మీదుగా ఆయకట్టు ప్రాంతాలకు రైతులు వెళ్లాలంటే రైతులు కిరాయి ఖర్చులు తడిసి మోపెడవుతాయి. రైల్వే శాఖ అధికారులు పునరాలోచించాలి.

– కుక్కల ప్రసాద్, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, భీమడోలు

కుష్టు వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించాలి

దెందులూరు: కుష్టు వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే అంగవైకల్యం రాదని డిస్ట్రిక్ట్ లెప్రసీ ఎయిడ్స్ టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ ఎం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వేగవరం డామియన్ లెప్రసీ సెంటర్ వద్ద పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రారంభమైన ఇంటింటా కుష్టు వ్యాధి సర్వేలో భాగంగా ఫిబ్రవరి రెండు వరకు ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వహిస్తారన్నారు. కుష్టు వ్యాధి గుర్తింపు శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో బహుళ ఔషధ చికిత్స ఎండీటీ వైద్యసేవలు ఉచితంగా కుష్టు వ్యాధిగ్రస్తులకు అందిస్తున్నట్టు తెలిపారు. ఇంటింటికీ సర్వే నిమిత్తం వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి ప్రతి ఒక్కరూ తమ పూర్తి సహాయ సహకారాలు అందించి కుష్టు రహిత సమాజ ఆవిర్భావానికి తోడ్పాటును అందించాలని డాక్టర్ నాగేశ్వరావు అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కామవరపుకోట: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెన్నారావు సోమవారం తెలిపారు. ఎస్సై చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గొల్లా శ్రీను (30) సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి వివాహం కాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలు దేరి తడికలపూడి వచ్చి మరలా తిరిగి వెళుతుండగా స్థానిక సినిమా హాలు సమీపంలో ఏలూరు నుంచి ఎదురుగా వస్తున్న వ్యాన్ శ్రీను నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి శ్రీనును తీసుకెళుతుండగా మార్గమధ్యలో మరణించినట్టు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

భీమడోలు: వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. భీమడోలు మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ కనుమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగా, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ బి.రమాదేవి హాజరయ్యారు. ముందుగా సమావేశానికి సభ్యుల హాజరు నామమాత్రంగా ఉండడంతో ఎంపీపీ అసహనం వ్యక్తం చేసారు. వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు సభలో వివరించారు. సభ్యులు పలు సమస్యలను సభలో ప్రస్తావించారు. గతేడాది సార్వాలో వచ్చిన తుఫాన్లలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించలేదని ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. జగనన్న కాలనీలో ఇళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఉచితంగా విద్యుత్ మీటర్లు అందించిందని, ప్రస్తుతం ఉచితంగా ఇవ్వడం లేదని ప్రభుత్వానికి రుసుం చెల్లించాలని విద్యుత్ సిబ్బంది అంటున్నారని, దీంతో లబ్ధిదారులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇంటింటికీ రేషన్ ఇవ్వడం లేదని ఆయన వాపోయారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

సభ్యులు సభలో లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ కనుమాల రామయ్య మాట్లాడుతూ భీమడోలు పరిషత్ సాధారణ నిధులు రూ.1.5 కోట్లతో గ్రామాల్లోని మంచినీటికి, డ్రెయిన్లు, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలోని సమస్యల పరిష్కరించుకునేందుకు వారికి నిధులు కేటాయించామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ మండలావృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలను చర్చించుకునే సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరు నామమాత్రంగా ఉండడం బాధాకరమని ఎంపీపీ అన్నారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ భూముల రీసర్వే కార్యక్రమం సూరప్పగూడెం చేపట్టామని తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఈశ్వరరావు మాట్లాడుతూ కొల్లేరులో సాంప్రదాయక వేట చేసుకునేందుకు మత్స్యకారులు విధిగా లైసెన్సులు పొందాలని అన్నారు. అగ్నిమాపకాధికారి జి.నాగరాజు మాట్లాడుతూ భీమడోలులోని అగ్నిమాపక కేంద్రం మరమ్మతుల నేపథ్యంలో సేవలను నిలిపివేశామన్నారు. ప్రమాదాలు సంభవిస్తే ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు అగ్నిమాపక శకటాలు చేరుకుంటాయని, ప్రజలు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీలు ఆల్తి గోపి, పొల్నాటి శ్రీను, అంబటి దేవి, వనమాల సుజాత, రాజు, పొల్నాటి శ్రీను, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలు వివరిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు గంటా శ్రీనివాసరావు

చలి తీవ్రత.. వ్యాధులతో చేపలు మృత్యువాత


- ఆక్వా సాగుకు గండంగా మారిన మంచు
- రాత్రి, పగటి ఉష్ణోగ్రతల్లో అధిక వ్యత్యాసం
- మారిన వాతావరణ పరిస్థితులతో ఆక్వా రైతులకు ఇక్కట్లు



శంఖు జలగ తెగులు సోకిన చేప



రెడ్ వ్యాధి సోకిన శీలావతి చేపలు



పేను తెగులు సోకిన చేప

గణపవరం: శీతాకాల ప్రభావంతో మారిన వాతావరణ పరిస్థితులు ఆక్వా సాగుకు గండంగా మారాయి. తగ్గిన ఉష్ణోగ్రతలు, పెరిగిన చలితీవ్రతతో చేపలను పలు రకాల రోగాలు చుట్టుముట్టి రైతులకు ఊపిరిసలపకుండా చేస్తున్నాయి. శీతాకాలం ప్రభావంతో కొన్ని వారాలుగా రాత్రి, పగటి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా నమోదవుతోంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకూ అధికంగా మంచు కురుస్తూ చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. రాత్రి వేళల్లో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఇలాంటి వాతావరణంలో ఆక్వా చెరువుల్లో చేపలకు రకరకాల వ్యాధులు సోకి మృత్యువాత పడుతున్నాయి.

చుట్టుముట్టిన సీజనల్ వ్యాధులు

ముఖ్యంగా రెడ్ డిసీజ్, తాటాకు తెగులు, చేప పేను, శంఖు జలగ, డ్రాప్సీ, ఐప్లక్స్ వంటి సీజనల్ వ్యాధులు చుట్టుముట్టాయి. ఈ పరిస్థితుల్లో చేపల పెంపకందారులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నష్ట నివారణ సాధ్యమని గణపవరం మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ తెలిపారు. శీలావతి, కట్ల రకం చేపలకు ఎక్కువగా, రూప్ చంద్, ఫంగస్ వంటి రకాల చేపలకు తక్కువగా రెడ్ డిసీజ్, తాటాకుల తెగులు వంటి వ్యాధులు సోకుతాయి. ఈతెగులు సోకిన ప్రారంభంలో చెరువులో చేపలు పదుల సంఖ్యలో మృత్యు వాత పడుతుంటాయి. తక్షణ నివారణ చర్యలు చేపట్టకపోతే నష్టం తీవ్రంగా ఉంటుంది. స్వల్ప వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో చేపలు మృత్యువాత పడి, రైతులకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. రెడ్ డిసీజ్‌తో పాటు, తాటాకు తెగులు కూడా ఒకేసారి వ్యాపించే అవకాశం ఉంటుంది. రెండు రకాల వ్యాధులు ఒకే చెరువులో ఉంటే ఎక్కువ పరిమాణంలో చేపలు మృత్యువాత పడతాయి.

ముందస్తు నివారణ చర్యలతో సత్ఫలితం

ముందస్తు నివారణ చర్యలతో సత్ఫలితం ఉంటుందని వ్యావసాయ శాఖ అధికారులు అంటున్నారు. రైతులు ముందస్తుగా వ్యాధుల నివారణకు శీతాకాలం సమీపిస్తున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి నెలలో మూడు రోజులు ప్రభుత్వం అనుమతించిన యాంటీ బయాటిక్స్ చేపల రంగ నిపుణుల సలహామేరకు మేతతో కలిపి అందించాలి. వారానికి ఒకసారి ఎకరా చెరువులో 25 కిలోల ఉప్పు, 40 కిలోల ముగ్గు చల్లాలి. నీటి నాణ్యతా పరీక్షలు, బ్యాక్టీరియా పరీక్షలు చేయించి, తగిన పరిమాణంలో శానిటైజర్‌ను చెరువు నీటిలో చల్లాలి. ఆక్సిజన్ శాతం ఉదయం 3.5 నుంచి 4.5లోపు ఉండేలా చెరువుల్లో ఏరియేటర్లు ఏర్పాటు చేసుకుని నిరంతరం తిరిగేలా చూడాలి. పీహెచ్ స్థాయి 7.8 నుంచి 8.5 లోపు ఉండేలా చూడాలి. అమ్మోనియా, నైట్రేట్లు పెరగకుండా ఒకరోజు జియోలైట్, మరో రోజు ప్రోబయోటిక్స్‌ను చెరువునీటిలో చల్లాలి. ఫార్మాలిన్, ఎలిమెంటల్ కాపర్, మిథైలీన్‌బ్లూ వంటి కెమికల్స్ కలిగి ఉన్న రసాయనాలను చెరువునీటిలో కలపాలి. చేపలు ఎక్కువగా చనిపోతుంటే బ్యాక్టోబాన్ వంటి అధిక సాంద్రత కలిగిన శానిటైజర్‌ను చల్లాలని మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ తెలిపారు ఆక్వా రైతులకు సూచించారు.

మంచుకురిసే వేళలో..



ఆయిల్‌పామ్ తోటలో మంచు

మంచుకురిసే వేళలో ప్రకృతి అందాలు వర్ణనాతీతం. సోమవారం హిమసోయగం కనువిందు చేసింది. ఇళ్లపై దుప్పటి మాదిరిగి పర్చుకుంది. సూరీడు కూడా మంచు పొరలు చీల్చుకుంటూ ఉదయించి వెలుగులు ప్రసరింపచేయటానికి అష్టకష్టాలు పడ్డాడు. పచ్చని పంట పొలాలు, అందులోని పంట కూడా మంచు పరదా కప్పింది. ఆకులు, పండ్లపై మంచు బిందువులు జారిపోతూ ప్రకృతి ఆరాధకులను మైమరపించింది. మండల కేంద్రమైన పెదవేగిలో ఈ సుందర దృశ్యాల సోమవారం తెల్లవారుజామున ఇలా దర్శనమిచ్చాయి. – పెదవేగి



రహదారిని కమ్మేసిన మంచు పొరలు



పచ్చని పంట పొలాల్లో తెల్లటిచాయగా మంచు

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



కురెళ్లగూడెం గంగానమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వాసుబాబును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమడోలు: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరూ మెలగాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అన్నారు. కురెళ్లగూడెం గ్రామ దేవత గంగానమ్మ జాతర మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. అమ్మవారికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేసారు. వాసుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసారు. ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వాసుబాబుకు ఘన స్వాగతం పలికారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగానమ్మ దీవెనలతో గ్రామమంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నీలపాల గంగాధరరావు, నాయకులు గుడివాడ సీతారామాంజనేయులు, పాటంశెట్టి అచ్యుతరామరావు, చిలుకూరి శ్రీను, కొడుసు గోపి, అల్లూరి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

31 వరకు పశు ఆరోగ్య శిబిరాలు



గోవిందరాజు, జిల్లా పశు వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్

దెందులూరు: పశు ఆరోగ్య శిబిరాలు సోమవారం నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని, దీనికి సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పశు వైద్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ గోవిందరాజు అన్నారు. సోమవారం దెందులూరు పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ పశు ఆరోగ్య శిబిరాల్లో గొర్రెలు, మేకలు, లేగదూడలకు, పాడి పశువులకు నట్టల నివారణ మందు తాగిస్తామని తెలిపారు. పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తామన్నారు. 14 మండలాల్లో లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తున్నామని పాడి రైతులను ఉత్సాహపరిచేందుకు, లేగదూడల పెంపకం పట్ల అవగాహన కలిగించేదుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అందాల ప్రదర్శనలో లేగదూడలకు ఖనిజ మిశ్రమ లవణాల ప్యాకెట్లు, మందులు అందించడంతోపాటు రైతులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో గల 27 మండలాల్లో మండలానికి రెండు టీములు చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్యాంపులపై రైతుల్లో అవగాహన కలిగించేందుకు పోస్టర్లు, కరపత్రాలు సిద్ధం చేశామన్నారు. రైతు సోదరులందరూ ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని జెడీ తెలిపారు.

విద్యార్థులకు బైబిల్ క్విజ్ పోటీలు

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులందరికీ ఆధ్యాత్మిక చింతన విద్య, సత్ప్రవర్తన నిరంతర సాధన కలిగి ఉండాలని ఆర్‌సీఎం దెందులూరు చర్చి ఫాదర్ జి అమన్‌రాజా అన్నారు. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో నాలుగు గ్రూపులు విద్యార్థులు పాల్గొనగా మూడు గ్రూపులు విద్యార్థులు విజయం సాధించారు.

23 నుంచి పరిశుద్ధ నిత్య సహాయమాత మహోత్సవాలు

దెందులూరు: పోతునూరులోని పరిశుద్ధ నిత్య సహాయమాత మహోత్సవాలు పదవ దేవాలయ ప్రతిష్ట వార్షికోత్సవం ఈనెల 23 నుంచి నిర్వహిస్తున్నామని పోతునూరు సంఘ పెద్దలు తెలిపారు. పరిశుద్ధ నిత్య సహాయ మాత మహోత్సవాలకు సంబంధించి పతాక ఆవిష్కరణకు దైవజనులు పోతునూరు విచారణ గురువు రెవరెండ్ రాయరాల ప్రకాష్‌రావు, దెందులూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ అమ్మన్ రాజా, సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజి కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, నత్త జోసెఫ్, ఎం రాజు, రాజేష్‌తోపాటు ముఖ్యఅతిథిగా ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు ఆధ్వర్యంలో దివ్య బలి పూజ నిర్వహించనున్నట్టు పోతునూరు విచారణ గురువు అరేవరన్ ఫాదర్ తంబి తెలిపారు.